మద్యానికి మంత్రి ఉన్నా.. విద్యాశాఖకు ఎందుకు లేడు ?

- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు పోతు అనిల్‌కుమార్

వేములవాడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ ప్రభుత్వంలో మద్యానికి మంత్రి ఉన్నాడని.. మరి విద్యాశాఖకు ఎందుకు ఎవరినీ నియమించ లేదని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు పోతు అనిల్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం వేములవాడలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో 17 నెలల పాలనలో విద్యావ్యవస్థ మొత్తం కుంటుపడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేసి పౌష్టికాహారం నాణ్యమైన విద్యను అందించింది తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయడమే కాకుండా విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మౌలిక వసతులు, సదుపాయాలను మెరుగుపర్చకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ విద్యార్థి విభాగం నాయకులు తుమ్మల దిలీప్, పర్వేజ్, రాకేశ్, శివ, తదితరులున్నారు.

సొంత స్థలంలోకి జిల్లా రవాణా శాఖ కార్యాలయం

సారంపల్లిలో రవాణా శాఖ కార్యాలయం వద్ద అధికారులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 11: జిల్లా రవాణా శాఖ కార్యాలయం తంగళ్లపల్లి మండలం సారంపెల్లిలోని సొంత స్థలంలోకి గురువారం మార్చామని రవాణా శాఖాధికారి లక్ష్మణ్ తెలిపారు. రవాణా సిబ్బంది మోటారు వాహన తనిఖీ అధికారి వంశీధర్, సహాయక మోటారు వాహన తనిఖీ అధికారి రజినీదేవి, జిల్లా రవాణా శాఖ సభ్యుడు సంగీతం శ్రీనాథ్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం ప్రారంభించారు. కార్యాలయం విద్యానగర్‌లోనే ఉంటుందని, డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్, వాహన ఫిట్‌నెస్ రిజిస్ట్రేషన్స్‌ను సారంపెల్లి టెక్స్ టైల్‌పార్క్ ఆవరణలోని ఐదెకరాల రవాణా శాఖవారి సొంత స్థలంలో తనిఖీలు చేస్తారన్నారు. వాహన వినియోగదారులు గమనించాలని రవాణాధికారి లక్ష్మణ్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 11: మండల వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య ఒక ప్రకటనలో కోరారు. రైతులు వరికోసి ఇరవై రోజులు అవుతున్నా కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించలేదన్నారు. ప్రారంభించిన రెండు సెంటర్లలో గన్నీ సంచులు, టార్పాలిన్లు సరిగా లేవన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించి మిల్లులను అలర్ట్ చేయాలని కోరారు. రైతులు వరిధాన్యం అమ్ముకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, చేసేదేం లేక ప్రైవేటుకు ధాన్యం అమ్ముకొంటున్నారని వాపోయారు. ప్రభుత్వం అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని కోరారు.

బోయినపల్లి రూరల్ : మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సిరిసిల్ల టౌన్ : తెలంగాణ భవన్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా జ్యోతిబా ఫూలే జయంతి

సిరిసిల్ల టౌన్/ వేములవాడ రూరల్/ముస్తాబాద్/ఇల్లంతకుంట/బోయినపల్లి రూరల్ /చందుర్తి , ఏప్రిల్ 11 :అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు, సబ్బండ వర్గాలు అభివృద్ధికి నిరంతరం శ్రమించిన జ్యోతిబా పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకలకు హాజరైన వక్తలు మాట్లాడుతూ, పూలేను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, తదితరులున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ పాల్గొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో పూలే విగ్రహానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమ సమాజ నిర్మాణంలో పూలే పాత్ర ఆచరణీయమని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు.

సిరిసిల్ల టౌన్ : గాంధీచౌరస్తాలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

స్థలం కేటాయింపు

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 11: జిల్లా కేంద్రంలో సంఘానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంత్రి శ్రీధర్ బాబుకు కురుమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో శుక్రవారం వివిధ కార్యక్రమాలకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు తమకు సంఘ భవనానికి, తమ పిల్లలకు హాస్టల్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, సంబ లక్ష్మీరాజాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కోనరావుపేట, ఏప్రిల్ 11: మల్కపేట గ్రామంలోని సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు చైత్రమాసం శుక్లపక్షం రోజున లక్ష్మీదేవి అమ్మవారి తిరు నక్షత్రం సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. వేడుకలో ఆలయ వ్యవస్థాపకుడు చల్మెడ ఆనందరావు, వారి కుటుంబ సభ్యులు చల్మెడ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

రాజన్న తలనీలాల సేకరణకు
రూ.13.67 కోట్లకు ఆన్‌లైన్ టెండర్

- ఐదోసారికి తమిళనాడు చెందిన కాంట్రాక్టర్ దాఖలు చేసిన బిడ్
- దేవాదాయశాఖ ఉన్నత అధికారులను సంప్రదించి నిర్ణయం : ఈవో

వేములవాడ, ఏప్రిల్11 : వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలను పోగు చేసుకునేందుకు 2025-27 రెండు సంవత్సరాలకు హక్కులు పొందేందుకు ఆలయ అధికారులు టెండర్లు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాజన్న ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి సమక్షంలో ఐదోసారి టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. అయితే బహిరంగ వేలానికి హైదరాబాద్‌కు చెందిన రెండు కంపెనీలు హాజరైనప్పటికీ వారు వేలం పాట పాడడానికి ముందుకు రాలేదు. దీంతో ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన వాటి వివరాలను అధికారులు పరిశీలించగా తమిళనాడు రాష్ట్రంలోని దొరై ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ 13 కోట్ల 67 లక్షల 55 వేల 500 రూపాయలకు మరో కేఎం ఇంటర్నేషనల్ అనే సంస్థ 12 కోట్ల, 35 లక్షల 55 వేల రూపాయలకు టెండర్లను బిడ్ చేసింది. గడిచిన 2023-25 రెండు సంవత్సరాలకు 19 కోట్ల ఎనిమిది వేలకు ధర పలికిన విషయం తెలిసిందే. అయితే ఐదోసారి వచ్చిన ఆన్‌లైన్ టెండర్లపై కమిషనర్ ద్వారా తుది నిర్ణయం తీసుకుంటామని ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

రెండున్నర కోట్లు చెల్లించిన కాంట్రాక్టర్

వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాలను పోగు చేసుకునేందుకు హక్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్వామివారికి ఏడు కోట్ల రూపాయలు బకాయి ఉన్న విషయం తెలిసిందే. అయితే సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కాంట్రాక్టర్ స్వామివారికి మార్చి 28న మరో కోటిన్నర రూపాయలు చెల్లించాలని రాజన్న ఆలయ అధికారులు తెలిపారు. శనివారంతో గడువు ముగిస్తుండగా ప్రభుత్వానికి ఇచ్చిన హామీలో భాగంగా ఇప్పటి వరకు మూడున్న కోట్ల రూపాయలు స్వామివారికి ఉన్న బకాయిలను చెల్లించాడని వారు తెలిపారు. ఇక మిగిలిన మూడున్నర కోట్లను వచ్చే జూన్ నుంచి ప్రతినెలా చెల్లిస్తానని ఇప్పటికే సంబంధిత చెక్కులను అధికారులకు అప్పగించారు.

బార్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వేములవాడ, ఏప్రిల్ 11 : వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 9న ముగియగా అధ్యక్షుడిగా బరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో ఎన్నిక టై కావడం, చెరో ఆరు నెలలు అధ్యక్షులుగా కొనసాగేందుకు ఒప్పుకోవడం తెలిసిందే. శుక్రవారం నూతన అధ్యక్షుడిగా గుండా రవి, కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి కేశన్నగారి గోపికృష్ణ బార్ అసోసియేషన్ హాలులో ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుండా రవి మాట్లాడుతూ, న్యాయవాదుల ఎదుర్కొంటున్న సమస్యలపై శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి భీమా మహేశ్‌బాబు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఇదే : అధ్యక్షులుగా గుండా రవి, గుడిసె సదానందం, ఉపాధ్యక్షులుగా కటకం జనార్దన్, జనరల్ సెక్రటరీగా గడ్డం సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా బొజ్జ మనోహర్, జాయింట్ సెక్రటరీగా నాగుల సంపత్‌గౌడ్, లైబ్రరీ సెక్రటరీగా పంపిరి శంకరయ్య, మహిళా ప్రతినిధిగా జక్కుల పద్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు కనికరపు శ్రీనివాస్, కనపర్తి రాజశేఖర్, తమిరి అన్నపూర్ణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గుడిపల్లి మహేశ్, బూర సరిత, తిరుపతి ఎన్నికయ్యారు.

కొండాపూర్ వాగులో ఇసుక రీచ్‌కు అనుమతులు

ముస్తాబాద్, ఏప్రిల్ 11 : ప్రభుత్వ అభివృద్ధి పనులు, గృహ వసరాల కోసం ఇసుకకు ఇబ్బందులు కలుగకుండా మండలంలోని కొండాపూర్ మానేర్ వాగులో ఇసుక రీచ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తహసీల్దార్ సురేశ్ తెలిపారు. గతంలో ఆవునూర్ మానేర్ వాగులో ఇసుక రీచ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, వాగులో నీటి నిల్వకు గత ప్రభుత్వం చెక్ డ్యాం నిర్మించడంతో ఇసుక తరలింపునకు వీలు లేకపోయిందన్నారు. స్థానిక అవసరాలకు ఇబ్బందులపై ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించగా కొండాపూర్ వాగు నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులిచ్చారని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 11 : మిడ్ మానేరు, అనంతగిరి రిజర్వాయర్ కింద ముంపునకు గురైన గ్రామాల ప్రజలు ఈ నెల 21 లోగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అర్హత గల ముంపు గ్రామాల ప్రజలు ఇందిర మ్మ ఇండ్ల కోసం మీసేవ కేంద్రంలో, జిల్లా వెబ్ సైట్ https://rajannasircilla.telangana.gov.inలో ధ్రువీకరణ పత్రాలు జత చేస్తూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా కాపుల సింహగర్జన

- రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య

విలేకరులతో మాట్లాడుతున్న మున్నూరుకాపు పటేల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

వేములవాడ, ఏప్రిల్ 11: పార్టీలకతీతంగా మున్నూరుకాపుల సింహగర్జన సభను నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కకాపుబిడ్డా హాజరై విజయవంతం చేయాలని మున్నూరుకాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. వేములవాడలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వం బీసీ కులగణనలో 13 లక్షల జనాభాతో మూడున్నర శాతం తక్కువగా చూపారని అన్నారు. 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో మొదటి స్థానంలో ఉన్న కాపులను కులగణన తర్వాత ఐదవస్థానంలోకి నెట్టింది ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వం చూపిన లెక్కల ప్రకారం విద్యార్థులకు రిజర్వేషన్, యువతకు ఉద్యోగాలు తదితర అంశాల్లో నష్టం వాటిల్లుతుందనే రాష్ట్రంలోని 33 జిల్లాల నాయకత్వంతో పార్టీలకతీతంగా 10 లక్షల మంది కాపులతో సింహగర్జన నిర్వహించబోతున్నామని తెలిపారు. జిల్లాలో కొందరు కాంగ్రెస్ నాయకులు దీనిని వ్యతిరేకిస్తున్న తీరు సరికాదన్నారు. మన బలాన్ని ఐకమత్యం చూపుతూనే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి వస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. నేను ఎక్కడ ఆది శ్రీనివాస్‌ను విమర్శించడం లేదని నేను కాపు కులానికి మాత్రమే సేవ చేస్తున్నానని చెప్పారు. జిల్లా నుంచి కూడా కాపులు సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ప్రాంతంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి చిరంజీవి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడమే కాకుండా అయ్యప్పదేవాలయం లాంటివి నిర్మించి తాను ఎంతో సేవ చేశానని చెప్పారు. అసలేం చేశాడని ప్రశ్నిస్తున్న నాయకులకు తన గురించి తెలుపకపోవడం విడ్డూరంగా ఉందని ఇవేదన వ్యక్తం చేశారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

మద్దికంటలో ధాన్యం కొనుగోలు ప్రారంభంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు

ముస్తాబాద్, ఏప్రిల్ 10 : ప్రభుత్వం మహిళా గ్రూప్ సభ్యులతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, మహిళా నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు సమన్వయం చేయాలని మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మండలంలోని మద్దికుంట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు. ఇక్కడ ఏఎంసీ చైర్‌పర్సన్, డైరెక్టర్ సత్తయ్యగౌడ్ నాయకులున్నారు.

వీర్నపల్లి వాసికి ఇంజినీరింగ్‌లో డబుల్ డాక్టరేట్

డాక్టరేట్ పట్టా తీసుకుంటున్న కృష్ణ

వీర్నపల్లి, ఏప్రిల్ 11: మండల కేంద్రానికి చెందిన సామల్ల సావిత్రి హన్మయ్య కుమారుడు సామల్ల కృష్ణ ఇంజినీరింగ్‌లో డబుల్ డాక్టరేట్ పొందాడు. పదకొండేళ్ల కిందట కాకినాడ జేఎన్టీయూలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శబ్ద తరంగాల అలజడిలో జరిగే వెయ్యో వంతు శబ్దాన్ని పసిగట్టే అల్గారిథంను రూపొందించాడు. ఈ పరిశోధనతో సిగ్నల్ ట్రాన్స్‌మిషన్‌లో పెను మెరుపులకు దారితీయగా డాక్టరేట్ పొందాడు. అయితే వృత్తి విద్యలో అపార అనుభవమున్న కృష్ణ, డాక్టర్ పెరుమాళ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో స్పూఫింగ్ మాఫియా (స్పూఫింగ్ అంటే తెలియని మూలం నుంచి వచ్చిన కమ్యూనికేషన్‌ను తెలిసిన, విశ్వసనీయ మూలం నుంచి వచ్చినట్లుగా దాచిపెట్టడం) పైన పరిశోధన చేశారు. అతడి ప్రతిభను గుర్తించిన చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మరో డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. డబుల్ డాక్టరేట్ పొందిన కృష్ణను యూనివర్సిటీ అధికారులు, పలువురు విద్యావేత్తలు అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE

★కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

CHANGE OF NAME

★I Kasetty Rajeshwer (old Name) R/o. 2-2-28, Metpally (M) Jagtial Dist, TS Have Changed name as "Kashetty Rajeshwar Rao" (New Name) S/o Kashetty Narayana. And My wife Kasetty Sandhya Rani (Old name) have Changed " Kashetty Sandhya Rani"
TTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కోర్టు ఉత్తర్వులు ధిక్కరిస్తున్న అధికారులు

- వేములవాడ ప్రధాన రహదారి విస్తరణ నిర్వాసితుల ఆరోపణ

వేములవాడ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రధాన రహదారి విస్తరణ నిర్వాసితులు

వేములవాడ, ఏప్రిల్ 11 : ప్రధాన రహదారి విస్తరణ కోసం రాష్ట్రం ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించామని, తమకు హైకోర్టు వెసులుబాటు కల్పించినా, ప్రభుత్వ అధికారులు కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్నారని వేములవాడ పట్టణ ప్రధాన రహదారిలో నివాసాలు, దుకాణాలు కోల్పోతున్న యజమానులు ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే రెండు దఫాలుగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. చట్ట విరుద్ధంగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని తాము న్యాయవాది పొలాస గిరి కృష్ణ ద్వారా హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు న్యాయస్థానం తమకు వెసులుబాటు కల్పిస్తూ స్టే ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మొదటి ప్రైమరీ నోటిఫికేషన్‌పై రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. మరోసారి విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ పై కూడా హైకోర్టు తమకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని వీటిన్నంటిని సంబంధిత అధికారులకు అందించామని తెలిపారు. అయిన్నప్పటికీ వారు యథావిధిగా నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గురువారం కూడా మరోసారి రెండు మాసాల పాటు ఎలాంటి పనులు చేయవద్దని మరోసారి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయిన్నప్పటికీ అధికారులు హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ కొలతలు, అంచనాలు వేస్తుండడంపై తాము మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. మానవాత దృక్పథంతో అధికారులు వ్యవహరించాలే కానీ కక్షపూరితంగా వ్యవరిస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. ఇక్కడ నిర్వాసితులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, బొడ్ల అశోక్, ప్రసాద్, కొమ్మశంకర్, కొమ్మ ప్రకాశం, యాద సత్యదీప్, పోలాస రాజేశ్వర్, కంకణాల క్రాంతి తదితరులున్నారు.

కట్నం కోసం వేధించిన భర్తకు ఏడాది జైలు

- అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సృజన తీర్పు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: కట్నం కోసం భార్య ను వేధించిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి కే సృజన శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, పోతిరెడ్డిపల్లికి చెందిన మాధవికి చిన్నబోనాలకు చెందిన పడిగె తిరుపతితో 2007 లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.4లక్షలు నగదుతో పాటు 5 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. పెళ్లి అయిన ఐదేండ్లు ఇబ్బంది లేకుండా చూసుకున్నప్పటికీ ఐదేండ్ల నుంచి భర్త తిరుపతి, అతని తల్లిదండ్రులు మాధవిని అదనపు కట్నం కోసం చిత్రహింసలకు గురిచేయగా ఆమె తల్లిగారింట ఉండిపోయింది. ఇదే అదనుగా భావించిన తిరుపతి మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న మాధవి తనను మోసం చేసి మరో మహిళను వివాహం చేసుకున్నాడని భర్త తిరుపతిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. విచారణ అధికారి వీ నరేశ్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్‌నాయుడు, ఆర్ఎస్ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ పానుగంటి శంకర్ సాక్ష్యం ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై సతీశ్‌గౌడ్ వాదించగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి తిరుపతికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి

- జులాయిగా తిరగవద్దన్నందుకు ఘాతుకం
- ఎల్లారెడ్డిపేటలో ఘటన

కనకయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11: పనిచేయకుండా జులాయిగా తిరగొద్దు అన్నందుకు తండ్రిని కొడుకు కొట్టడంతో మృతి చెందాడు. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో ఓ ఇంటిలో పెండ్లి ఉండగా అదే కాలనీకి చెందిన కుంచెపు కనకయ్య(50) తన ఇంటి ఎదుట కూర్చుని ఉండగా అతడి కొడుకు పరశురాములు పెళ్లి వేడుక నుంచి ఇంటికి చేరుకున్నాడు. దీంతో పని లేకుండా జులాయిగా ఎందుకు తిరుగుతున్నావని కొడుకు పరశురాములు కనుకయ్య మందలించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తరుచూ తండ్రితో గొడవ పడే పరశురాములు మరోమారు అలాగే గొడవపడ్డాడు. కాలనీవాసులంతా పెండ్లి వేడుకలో నిమగ్నమై ఉండగా కనకయ్యకు, పరశురాములుకు మాటామాటా పెరగడంతో తల్లి రాజవ్వ ఇద్దరినీ వారించింది. ఈ క్రమంలో పరశురాములు కోపోద్రిక్తుడై ఓ కర్రతో ఇంటి అరుగుపై కూర్చున్న తండ్రి మెడపై బలంగా కొట్టగా వెంటనే అపస్మారక స్థితిలో పడిపోయాడు. పరశురాములును అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కనకయ్య కొడుకు అక్కడి నుంచి పారిపోయాడు. కనకయ్యకు ఇద్దరు కూతుళ్లు, భార్య ఉంది. ఈ మేరకు కనకయ్య తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు పరశురాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సనుగుల మహిళకు సైబర్ కాల్

- రూ.5వేలు మోసపోయిన బాధిత మహిళ

చందుర్తి, ఏప్రిల్ 11: మీ కొడుకు ఆరోగ్యం బాగాలేదు. ఇప్పుడే దవాఖానకు తీసుకొచ్చినం. వెంటనే ఈ నంబర్‌కు రూ.5వేలు పంపండి అంటూ.. చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన ఓ మహిళకు సైబర్‌కాల్ వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సనుగుల గ్రామానికి చెందిన జంగిటి లక్ష్మి కొడుకు మనోజ్ ఆరు నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీ కొడుకు ఆరోగ్యం బాగాలేకపోతే ఇప్పుడే దవాఖానకు తీసుకొచ్చినం. వెంటనే నేను మాట్లాడుతున్న ఫోన్‌కు రూ.5వేలు పంపాలని చెప్పాడు. చలించిపోయిన ఆ మాతృమూర్తి వెంటనే డబ్బులు పంపింది. రెండు గంటల తర్వాత కుమారుడికి ఫోన్ చేసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసింది. తాను బాగానే ఉన్నానని, ఇప్పుడే పనికిపోయి రూమ్‌కు వచ్చానని చెప్పడంతో మోసపోయానని గ్రహించింది. వెంటనే ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు.

కేంద్రాన్ని రాష్ట్రాలే పోషిస్తున్నాయి

- రేషన్‌కార్డుపై మోదీ ఫొటో పెట్టాల్సిన అవసరం లేదు
- చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు